# ఏలియా ప్రవక్త ఐదు మంచి లక్షణాలు

• పాత, క్రొత్త నిబంధనల్లో ఆయన పేరు చిరపరిచితం. దేవునికి ఇష్టుడైన పరిచారకుడు. ఆయన సామాన్యుడే అయినా ఒక రాజు వెన్నులో వణుకు పుట్టించాడు. ఈరోజు గడవకముందే తనను చంపుతాను అని ప్రతిజ్ఞ చేసిన రాజ్యాతి నేతలు తర్వాత కుక్క చావు చచ్చారు. ఆయన భక్తికి ముచ్చట పడ్డ దేవాది దేవుడే స్వయంగా గుర్రాలను అగ్ని రధాన్ని పంప్పించి పిలచి తన అక్కున చేర్చుకున్నాడు.

-"యెహోవా నా దేవుడు" అని అర్థం వచ్చేలా వాళ్ళ అమ్మా నాన్న పెట్టిన పేరుకు పూర్తి సార్ధకతతెచ్చిన మహా భక్తుడు. ఇప్పటికే అర్ధం అయ్యి ఉంటుంది మీకు రోషము గల పరిచారకునిగా సాక్ష్యాత్తు దేవుని ముందే తనను తాను అడ్రెస్స చేసుకున్న గొప్ప ప్రవక్త ఆయన మరెవరో కాదు "ఏలియా"

ఇంత గొప్ప దైవజనునిగా బైబిల్ ద్వార కొనియాడబడి, క్రీస్తును ఎరిగిన ప్రతీ ఒక్క క్రైస్తవుడు అయనలా ఒక్క రోజు జీవించగలిగితే చాలు అనుకొనేంతటి ఆ మహా ప్రవక్తను గురించి,ఆయనలో దాగి ఉన్న గొప్ప లక్షణాలను గురించి మనం తెలుసుకోగలిగితే అయనలా తప్పకుండ జీవించడానికి ప్రయత్నించవచ్చు. దేవుని మహా కృపను బట్టి సాధించనూ వచ్చు!*

"ఏలియా" ప్రవక్తలో దాగియున్న ఐదు గొప్ప లక్షణాలను గురించి మనం ఈ వర్తమానంలో తెలుసుకొనే ప్రయత్నం చేద్దాం.!

## 1.ఆయన గొప్ప ప్రవక్త

దేవుని ఎరిగిన వ్యక్తిగా, దేవున్ని అనుసరించేవ్యక్తిగా ఏలియా దేవుని కోసం ప్రాణాలకు తెగించి ధైర్యంగానిలబడ్డాడు. దేవుని జనాంగమైన ఇశ్రాయేలు ప్రజల్ని కూడ అదే విధంగా నిలబడమని అడిగాడు.

అంతేకాదు (మొదటి రాజుల గ్రంధము, 18:21) వ వచనంలో *ఎన్నాళ్ళు మీరు రెండు తలంపుల మధ్య తడబడుతూ జీవిస్తారు. యెహోవా దేవుడైతే ఆయనను అనుసరించండి,అదే విధంగా బయలు దేవుడైతే బయలునే మీరు అనుసరించండి అని చాలా సూటిగా చెప్పాడు.* తాను నమ్మిన తన దేవుడు సర్వ శక్తిమంతుడు అని తెలుసు కాబట్టే అంత ధైర్యంగా అహాబు రాజు, బయలు ప్రవక్తల ప్రజల ముందు తన సవాలును సూటిగా విసరగలిగాడు. అందుకనే మనం అనుమానం లేకుండ చెప్పగలుగుతున్నాము ఏలియా ఒక గొప్ప ప్రవక్త అని.!

## 2. దేవునికి విధేయత కలిగి జీవించడం

తన జీవితమంతా కూడ ఏలియా ప్రవక్త దేవునికి అత్యంత విధేయునిగా జీవించాడు. ఏలియా ప్రవక్త జీవితాన్ని గనుక మనం గమనిస్తే ఆయన వేసే ప్రతి అడుగులోనూ దేవుని యెడల అచంచలమైన భక్తివిశ్వాసాలు మనకు కనిపిస్తూ ఉంటాయి.

Source: Pas Abhisheck

తన ప్రాణం మీదకు వస్తుందని తెలిసి ఎన్నో సార్లు దేవుడు అహబుతో యెజెబెలుతో తెలుపమన్నా కఠినమైన మాటలను ఏ మాత్రం సంకోచించకుండ వారి దగ్గరకు వెళ్ళి వినిపించాడు. ఇక నాణేనికి రెండో వైపు అన్నట్లుగా దేవుడు అజ్ఞాపించినప్పుడల్లా మారు మాట్లాడకుండ దేశాన్ని విడచి వెళ్ళిపోయాడు. అవి వాగులైనా.. వంకలైనా.. అరణ్యాలైనా.. చివరకు అతి భయంకరమైన కరువు కాలంలో కూడ ఒక్క పూట తిండి లేని నిరుపేదరాలైనా సారెపతు విధవరాలి ఇంటికి వెళ్ళి దేవుని పిలుపు వచ్చే వరకు అక్కడే నివాసం ఉన్నాడు. దేవునికి అత్యంత విధేయునిగా జీవించిన ఏలియా ప్రవక్త కష్టాలలోనూ నష్టాలలోనూ చివరకు తన ప్రాణం మీదకు వస్తుందని తెలిసిన కూడ దేవునికి విధేయునిగా జీవిస్తూనే ఆయన చెప్పిన ప్రతీ ఒక్క కార్యము నెరవేర్చాడు.!

## 3.దేవుడు ఏర్పాటు చేసిన సదుపాయాలతో జీవించాడు

తన బిడ్డలకు ఏ ఇబ్బంది రాకుండ కంటికి రెప్పలాకాపాడుకొనే మన దేవుడు ఏలియాను కూడ అదే విధంగా కాపాడి నడిపించాడు. తాను మహిమ పరచబడేలా ఆయా సందర్భాలు పరిస్థితులను బట్టి ఏలియా ప్రవక్తకు తగిన సదుపాయాలను ఏర్పాటు చేసి పోషించాడు. ఇందుకు సంబంధించి మనం రెండు ముఖ్యమైన ఉదాహరణలను చెప్పుకోవచ్చు..

- కెరీతు వాగు దగ్గర నివసించిన ఏలియా ప్రవక్తకు దేవుడు కాకుల ద్వార ఆహారాన్ని పంపించాడు.
- ఉన్న కొద్ది పిండి నూనె చుక్కలతో ఏలియాతో పాటు సారెపతు విధవరాలిని బిడ్డను ఏళ్ల తరబడి దేవుడు పోషించాడు. ఏ అవసరతలో జీవించిన కూడ దేవుడే తగిన సదుపాయాలను ఏలియా ప్రవక్తకి ఏర్పాటు చేసి ఆయనను పోషించాడు.!

## 4. ఆయన గొప్ప ప్రార్ధనాపరుడు

మనిషి జీవితంలో ప్రార్ధన యొక్క ప్రాముఖ్యత ఎంతగా ఉంటుందో ఏలియా ప్రవక్తను చూసిఆయనను మనకు ఒక రోల్ మోడల్ గా భావించుకోవచ్చు. తనకు ఎదురైన ప్రతీ సమస్యను ప్రతీ కష్టాన్ని కూడ ప్రార్ధనతో జయించగలిగాడు. మన విశ్వాస నడతకు సంబంధించి ఏలియా ప్రవక్త మనకు ఒక మంచి ఉదాహరణ. యేసయ్యే మన సొంత రక్షకుడని నమ్మి ఆయనను అనుసరించడానికి ప్రార్ధన యోధునిలా జీవించడానికి మనల్ని ముందుకు నడిపించేమార్గ దర్శి ఏలియా ప్రవక్త అందుకే (యాకోబు పత్రిక,5:17) వ వచనంలో యాకోబు ఏలియా ప్రవక్తను గూర్చి వ్రాస్తూ *ఏలియా మన వంటి స్వభావం గల మనుష్యుడే వర్షింపకుండునట్లు అతడు ఆసక్తితో ప్రార్ధన చేయగా మూడున్నర సంవత్సరముల వరకు భూమి మీద వర్షింపలేదు అని ఏలియా ప్రవక్తను మనం ఆదర్శంగా తీసుకొని ప్రార్ధనపరులం అయ్యేలా ప్రోత్సహిస్తున్నాడు.

Source: Pas Abhisheck

## 5.దేవుని అద్భుతమైన కార్యాలను ఈ ప్రపంచానికి కనపరచాలని కోరుకున్నాడు

ఏలియా తన పరిచర్యలో దేవునిపై ఎంతటి విశ్వాసాన్ని కనపరిచాడో అదే రీతిలో దేవుని నుండికూడ అద్భుతకార్యాలను కోరుకున్నాడు కోరుకోవడమే కాదు వాటిని పొందుకున్నాడు కూడ. అంతేకాదు ఏలియా ప్రవక్త ప్రార్ధించగా ఆ ప్రార్ధన ఆలకించిన యెహోవా దేవుడు ఆకాశం నుండి అగ్నిని దించి బలి పశువును అక్కడ పేర్చిన రాళ్ళను సైతం పూర్తిగా దహించి వేసాడు.. ఈ కార్యం ద్వార ఇశ్రాయేలు ప్రజల ముందు దేవుని మహిమను ప్రత్యక్షపరచి దేవుని శక్తిని తన ప్రజలు తెలుసుకొనేలా చేసాడు. దేవుని ప్రవక్తలను అతి ఘోరంగా చంపి దేవుని దృష్టికి మహా పాపులుగా నిలచిన అహాబు యెజెబెలుల పతనానికి మొదటి బీజం ఆ రోజే వేసాడు.

ఇంకా సారెపతు విధవరాలి కుమారుని బ్రతికించడం, అహాబును హెచ్చరించి మూడేళ్లు ఆ దేశంలో వర్షం పడకుండ చేయడం, తిరిగి తానే దేవున్ని ప్రార్ధించి వర్షాన్ని కురిపించడం వంటి అద్భుతమైన కార్యాలు చేసి తాను నమ్ముకున్న తన దేవుడు సర్వ శక్తిమంతుడని ఈ లోకానికి రుజువు పరిచాడు.

* ఏలియా ప్రవక్త జీవితంలోని ప్రతీ పేజీముఖ్యమైనదే. దేవునికై నిలబడటంలో ఆయన మొండి ధైర్యం, తెగువ, ఏ మాత్రం మరువలేనిది. ఒకవైపు దేవుని ప్రవక్తలందరిని యెజెబెలు వెతికి మరి చంపివేస్తున్నా ఏలియా వెనుకడుగు వేయక అహాబుకు ఎదురెళ్ళాడు. కష్టాలు ఇబ్బందులు ఎదురైనప్పుడు కాస్త మనసు చెదరి మధనపడినా చివరికి దేవుని పక్షాన నిలబడి యెజెబెలు అహాబులకు ఎదురొడ్డి పోరాడాడు తన ప్రజలకు విజయాన్ని అందించాడు.

అంతేకాదు దేవునిలో తన వారసత్వం తన తదనంతరం కూడ కొనసాగేలా ఆ తర్వాత కూడ అంతే భయభక్తులతో జీవించే దేవునికి గొప్ప విధేయునిలా "ఎలీషా ప్రవక్తను" తయారు చేసి ఈ లోకానికి అందించాడు. అందుకే అంత గొప్ప భక్తుడ్ని దేవుడు కూడ అంతే గొప్పగా తన దగ్గరకు పిలచుకున్నాడు,అగ్ని గుర్రాలను అగ్ని రధాన్ని పంపి సుడిగాలి చేత ఏలియా ప్రవక్తను ఆకాశానికి ఆరోహనం చేసుకొని తీసుకొనిపోయాడు. ఆ విధంగా ఏ ఒక్కరికి దక్కని మహా భాగ్యాన్ని ఏలియాకు అందించి తన యందు నిలిచిన వానియందు, తాను నిలచి ఉంటానని దేవాది దేవుడు ఏలియా ప్రవక్త జీవితం ద్వార మనకుతెలియపరుస్తున్నాడు.మహా రోషముగలవాడను అని తనను తాను గర్వంగా ప్రకటించుకున్న ఏలియా అంతే గర్వంగా దేవుని యందు జీవించాడు.!

నేటికీ క్రైస్తవులకు ప్రవక్త గొప్ప మాదిరికరంగా నిలిచాడు. ఏలియా ప్రవక్తలో దాగి ఉన్న ముఖ్యమైన ఈ ఐదు లక్షణాలతో పాటుగా ఆయనలా మనల్ని మనం మలచుకొని దేవునిలో జీవించగలిగితే మనము మన కుటుంబాలు దేవునిలో సదాకాలం నిలచి ఉంటాయి.! ఆ విధంగా మనల్ని మనం మార్చుకొనేందుకు, గొప్ప ప్రార్ధనాపరులంగా జీవించేందుకు,త్వరలో రాబోయే యేసయ్య రాకడ కొరకు స్థిర చిత్తంతో నిరీక్షించేందుకు కావాల్సిన శక్తిని కృపను దయచేయుమని మనము ప్రార్ధించుదాం..పొందుకుందాం...!

Source: Pas Abhisheck